# కరాటే చదువులు



**చా**లా హడావుడిగా ఉందా ప్రాంతం.

ఆవరణమంతా కార్లతోనూ, స్కూటర్లతోనూ నిండి ఉంది. వరండాలో వేసిన బెంచీల మీద వాటి తాలూకూ ఓనర్లందరూ ఆ పబ్లిక్‌స్కూల్‌గురించీ, దాని స్టాండర్డ్ గురించీ చాలా ఎగ్జయిటింగ్‌గా మాట్లాడుకుంటున్నారు.

గొడవ కొంచెం ఎక్కువయ్యేసరికి ప్యూన్ బయటికొచ్చాడు, ఆఫీస్‌లో నుంచి. "ష్! సైలెన్స్!" అన్నాడు గట్టిగా.

అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"ఎందుకువయ్యా– గట్లలొల్లి పెడతారు! ఇదేం స్కూలనుకున్రా, మీ ఇల్లనుకున్రా?" కోపడ్డాడు ప్యూన్.

అక్కడున్న వాళ్ళలో గెజిటెడ్ ఆఫీసర్లున్నారు. కోటీశ్వరులయిన వ్యాపారులున్నారు. మాలాంటి గుమాస్తాగాళ్ళూ ఉన్నారు.

అయినా ఎవ్వరూ జవాబివ్వలేదు.

జవాబిస్తే ఆ ప్యూన్‌కి ఆగ్రహం కలుగుతుందనీ, ఆ ప్యూన్‌కి ఆగ్రహం కలుగుతే ఆ ప్రిన్సిపాల్‌కి ఆగ్రహం కలుగుతుందనీ ఆ ప్రిన్సిపాల్‌కి అగ్రహం కలుగుతే మహా ప్రఖ్యాతిగాంచిన ఆ పబ్లిక్‌స్కూల్లో తమ పిల్లలకు సీటు దొరకదనీ అందరికీ తెలుసు.

గోపాల్రావ్ ప్రాస్‌పెక్టస్ తీసి అందులోని రూల్స్ మళ్ళీ చదివాడోసారి! అంతకుముందు వారం రోజుల్నుంచీ ఇద్దరం ప్రాస్‌పెక్టస్‌లో ప్రతిలైనూ చదివి, చర్చించుకుని అర్థంచేసుకుంటూనే ఉన్నాం! అయినా ఏదో భయం!

"గురూ! మనవాళ్ళను అలా చెట్టుకిందకు తీసుకెళ్ళి ఓసారి మళ్ళీ అన్నీ అప్పజెప్పించుకుందామా?" అడిగాడు గోపాల్రావ్.

"పద!" అన్నాను.

నేను కిరణ్‌గాడిని, వాడుచిన్నిగాడిని నడిపించుకుంటూ దూరంగా ఉన్న ఓ చెట్టుకిందవెళ్ళి నిలబడ్డాం.

"ఓరే చిన్నీ చెప్పమ్మా! వాటీజ్ యువర్‌నేమ్?" అడిగాడు గోపాల్రావ్.

"మైనేమీజ్ కె. శరత్‌బాబు."

"వాటీజ్‌దిస్?"అన్నాడు వాడు పుస్తకంలోని పిల్లిబొమ్మను చూపించి.

"దిసీజ్ కాట్! సి ఎ టి కాట్!"

"టెల్ మీ ఆల్ఫాబెట్స్ ఫ్రం ఎ–టు–జడ్–"

వెంటనే వాడు ఎబిసిడిలు ఊపిరితిరగనంత స్పీడులో చెప్పేశాడు.

"ఇంకేం ఢోకాలేదులేరా?" అన్నాన్నేను ధైర్యం తెచ్చుకుని.

"అవును!" సంతృప్తిగా అన్నాడు వాడు.

తర్వాత ఇద్దరం కలిసి కిరణ్‌గాడిని కూడా టెస్ట్‌చేశాము.

అడగడం ఆలస్యం రకీమని చెప్పేశాడు వాడు.

ఒకటా–రెండా?

అంతకుముందు మూడు నెలల నుంచీ వాళ్ళను చిత్రహింసలు పెట్టి వాళ్ళు పెట్టే చిత్రహింసలు భరించి నేర్పించాము అవన్నీ! లేకపోతే వాళ్ళకి మంచి స్కూల్లో ఎడ్మిషన్ దొరకదని తెలుసుకదా! మళ్ళీ ఇద్దరం వెళ్ళి బెంచీల మీద కూర్చున్నాం.

మమ్మల్ని చూసి మిగతావాళ్ళు కూడా చెట్లకిందకు పిల్లలను తీసుకెళ్ళి వాళ్ళతో అన్నీ చెప్పిస్తున్నారు.

హఠాత్తుగా ప్యూన్ మళ్ళీ తలుపు తీసుకుని బయటికొచ్చాడు.

"అరె! ఎన్నిసార్లు చెప్పాలివయ్యా సైలెన్స్ గుండమని! ఏయ్–ఇగో నీకే చెప్పెడిది– ఎందుకట్ల లొల్లిపెడుతున్నావ్?" ఓ గెజిటెడ్ ఆఫీసర్ని పట్టుకుని దబాయించాడతను.

గెజిటెడ్ ఆఫీసరు ఖంగారుపడ్డారు. "పిల్లలకు కోచింగ్ ఇస్తున్నాను–" అన్నాడు దీనంగా.

"అదంతా గిప్పుడు చేస్తారువయ్యా– ఇన్నిదినాలకెల్లి ఏం జేసినావ్? ఇంక బంద్‌చెయ్–" అని అందరివేపూ ఓసారి చూశాడు.

"హెచ్. శ్రీనివాసరావ్ ఎవరు" అనడిగాడు అందరి ముఖాల వంక సెకండ్‌రౌండ్ చూస్తూ. "నేనే" అంటూ ఓ మూల వాళ్ళపాపకు బిస్కెట్లు తినిపిస్తున్న వ్యక్తిలేచి నిలబడ్డాడు.

"పాపన్దీసుకుని లోపలకు నడు!"

అతను ఖంగారుగా పాపచేతిలో బిస్కెట్లులాగి అవతలపారేసి ప్రిన్సిపాల్‌రూమ్‌లోకి ఈడ్చుకుపోయాడు.

అందరూ ఊపిరి బిగపట్టేశారు.

లోపల ఏం జరుగుతుందా అన్న ఆత్రుత!

పావుగంట తర్వాత చెమటలు తుడుచుకుంటూ బయటి కొచ్చాడతను. అందరం అతని చుట్టూ మూగాము.

"ఏమి అడుగుతున్నారండీ?" అన్నాడొకతను.

"ఏమడిగితే ఏం లాభం లెండి– ఎడ్మిషన్ దొరకలేదు–" అన్నాడతను. నీరసంగా– అక్కడి నుంచి వెళ్ళిపోతూ. అందరికీ భయం పట్టుకుంది.

మరోవ్యక్తిని లోపలకు తీసుకెళ్ళాడు ప్యూన్.

అతను బయటకొచ్చాక అందరూ మళ్ళీ అతని చుట్టూ మూగేశారు

"ఏమడిగాడండీ పాపను?" ప్రశ్నించాడొకతను కాగితం పెన్నూరడీగా పట్టుకుని.

"పాపనేమీ అడగలేదండీ?" బెంచీమీద కూలబడుతూ అన్నాడతను.

"మరి?"

"నన్నే అడిగాడు ప్రశ్నలన్నీ!"

"మిమ్మల్నా?" అందరి గుండెలూ గుభేలుమన్నయి.

"అవును!"

"ఏమడిగారు?"

"వేరీజ్ మూర్ ఐలెండ్?" అనడిగారు.

"ఆ!" అందరూ అదిరిపడ్డారు.

"మూర్ ఐలెండా?" ఓ లక్షాధికారి తెల్లబోతూ అడిగాడు

"అవును."

"అంటే ఏమిటసలది?"

"అది ఒక ద్వీపం ఆటండీ! ఎక్కుడుంది అనడిగారు.–" విసుక్కుంటూ చెప్పాడా వ్యక్తి తెలుగులో.

"ద్వీపం అంటే" మళ్ళీ అడిగాడా బిజినెస్ మ్యాన్.

"ద్వీపం అంటే కూడా తెలీదుటయ్యా" ఇంకెవరో ఫోజుతో అడిగాడు.

"ద్వీపం అంటే మూడువేపుల నీరు ఒకవేపు నేలవుంటుంది" అన్నాడు ఒకతను తెలిసినట్లు.

"కాదు–" ఇంకెవరో అరిచారు.

"ద్వీపం అంటే చుట్టూ సముద్రం మధ్యలో భూమివుంటుంది."

"చుట్టూ సముద్రమే ఉండనక్కరలేదు. నది నీరు చుట్టూ వున్నా దానిని ద్వీపమే అంటారు" అన్నాడు గెజిటెడ్ అఫీసర్‌గారు.

"కాదు" తను తాలూకాఫీసులో ఎల్డీసీగా పని చేస్తున్నాని అంతకుముందే పరిచయం చేసుకున్నాయన ఎదురుతిరిగాడు.

"చుట్టూ నీరువుంటే దానిని లంక అంటారు. సముద్రం వుంటే ద్వీపం అంటారు" అన్నాడతను.

కొంతమంది ఆలోచనలోపడ్డారు. అతని మాటలు నిజామా కాదా అని!

"ఇంతకూ ఆ మూర్ ద్వీపం ఎక్కుడుందసలు?" గోపాల్రావ్ బుర్రగోక్కుంటూ నన్నడిగాడు.

"సౌత్ అమెరికా దగ్గర" అన్నాన్నేను తడుముకోకుండా.

"కరెక్ట్! బ్లాక్‌సీలో ఉందది" అన్నాడు మరో ఆఫీసరు నన్ను సమర్థిస్తూ.

"కాదు మన ఇండియా దగ్గరే ఉందది" అన్నాడు మరొకతను. అంతా ఆశ్చర్యపోయారు.

"మన ఇండియా దగ్గరా?"

"అవును బంగాళాఖాతం సముద్రంలో ఉంది."

"నో! ఇటీజ్ నాట్ బే ఆఫ్ బెంగాల్. అరేబియా సముద్రం" అన్నారింకెవరో

"అదికూడా కాదు. ఇండియన్ ఓషన్, అంటే హిందూ మహాసముద్రం" అన్నాడు మరొకతను.

"అసలు మనకి మొత్తం ఎన్ని సముద్రాలున్నాయి?" అడిగారెవరో.

"అది సరేగాని– అసలీ ప్రశ్న మన పేరెంట్స్ నెందుకడిగినట్లు?" అకాయన ఆలోచిస్తూ అన్నాడు.

"అవును! నిజమే! మూర్ ఐలెండ్ సంగతి మనకెందుకుట?"

ఈలోగా మరో వ్యక్తి ప్రిన్సిపాల్ రూమ్‌లోంచి బయటపడ్డాడు హుషారుగా.

అందరూ అతని చుట్టూమూగారు.

"మిమ్మల్నేం అడిగారు?"

"19×19 ఎంతో చెప్పమన్నారు. ఠకీమని చెప్పేశాను. అంతే! మా అబ్బాయికి సీటు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు."

"అంటే మీ అబ్బాయినేమీ అడగలేదా?"

"ఒక్క ముక్కకూడా అడగలేదు."

"ఇదెక్కడి విడ్డూరం- తండ్రిని ప్రశ్నలడిగి కొడుకుని యల్‌కె.జిలో చేర్చుకోవడం" ఒకాయన ఆశ్చర్యపోతూ అన్నాడు.

"వాళ్ళు తండ్రి ఇంటలిజెన్స్‌ని పరీక్షిస్తున్నారండీ. తండ్రి ఇంటిలిజెంట్ అయితే కొడుకు ఇంటిలిజెంటయి ఉంటాడని ఐడియా! కనుక అందరూ అలాంటి తెలివగల పిల్లలనే స్కూల్లో చేరుకుంటే స్కూలుకి మంచి పేరొస్తుందనీ వాళ్ళ అభిప్రాయం." ఒకాయన వివరించాడు.

"నన్నడిగితే అలా అనుకోవడం పరమ తెలివితక్కువతనం" ఆఫీసరుగారన్నారు.

"ఎందుకని"

"పండిత పుత్ర: పరమశుంఠ:" అని మన పూర్వీకులు ఘోషించలేదుటండీ?

"అవును! వారు చెప్పింది నిజమే. కావాలంటే చరిత్ర తిరగేసుకోండి. గొప్ప గొప్పవారి పుత్రులంతా వెధవలే. అది ఈనాటి రాజకీయాలకు కూడా వర్తిస్తుంది..." అన్నాడు సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న ఆఫీసరుగారు.

"అది సరేగాని 19×19 ఎంత?" గోపాలావ్‌నన్నడిగాడు. నేను లోలోపల ఎక్కాలు చదవటం మొదలుపెట్టానుగానీ పందొమ్మిదిల దగ్గర కొచ్చేసరికి ఆగిపోతోంది.

అందరూ ఆన్సర్ కోసం ఆశగా నావంక చూడడం గమనించేసరికి అక్కడున్నవారెవరికీ ఆన్సర్ తెలీదనే నాకు అర్థమైపోయింది.

వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకుని త్వరత్వరగా 19×19 లెక్కకట్టడం ప్రారంభించాను.

"మూడు వందల అరవయి ఒకటి" అన్సర్ అందరికీ గట్టిగా చదివివినిపించాను.

అప్పటికప్పుడే అందరూ వరండా అంతా తిరుగుతూ పందొమ్మిదిపందొమ్మిదులు- మూడొందల అరవయి ఒకటి అని మననం చేసుకోసాగారు. మరో పెద్ద మనిషిని లోపలకు పిలిపించారు.

ఆయన దిగాలుపడిన ముఖంతో బయటకొచ్చాడు. కాసేపటికి అందరూ ఆయనను చుట్టుముట్టేశారు.

"మిమ్మల్నేమడిగారు?" అడిగాడు గోపాలావ్ ఆత్రుతగా

"నన్నేమీ అడగలేదు. నేను రైల్వేలో ఎల్డీసిగా పనిచేస్తున్నాని తెలీగానే సీటు దొరకదు వెళ్ళిపొమ్మన్నారు."

"అదేమిటి?" అందరం ఆశ్చర్యపోతూ అడిగాము.

"ఈ స్కూలు ప్యూనుక్కూడా మా కంటే ఎక్కువ జీతం వస్తుందిట! కనుక మాలాంటి లోక్లాస్ వాళ్ళకు అడ్మిషన్ ఇవ్వరట..."

ఈలోగా మరో వ్యక్తి లోపల్నుంచి ఆనందంగా బయటకురావటంతో అందరూ అతని దగ్గరకు పరిగెత్తారు.

"మా బాబుని ఎబిసిడీలు చెప్పమన్నారు. వాడు తముడుకోకుండా చేప్పేశాడు. అంతే ఎడ్మిషన్ ఇచ్చేశారు."

ఆ మాట వినేసరికి అందరికీ బోలెడు ధైర్యం వచ్చింది.

నేనూ, గోపాల్రావ్ కిరణ్గాడిని- చిన్నిగాడిని కూర్చోబెట్టి మళ్ళీ ఎబీసిడీలు చెప్పించాము.

ఈలోగా గోపాల్రావ్ పేరు పిలవనేపిలిచారు.

ఇరవయి నిమిషాల తర్వాత సీరియస్గా బయటకు వచ్చాడు. అందరం మామూలు గానే వాడిచుట్టూ మూగాము.

"ఏమడిగారు?"

గోపాల్రావ్ హఠాత్తుగా పూనకం వచ్చినట్లు వూగిపోతూ, పళ్ళుబిగపట్టి, చిన్నిగాడ్ని పట్టుకుని చావగొట్టసాగాడు.

అందరూ కలిసి వాళ్ళిద్దర్నీ విడదీశాం.

"రాస్కెల్- నెలరోజుల నుంచీ ప్రాక్టీస్ చేయించామా? వీడులోపల కెళ్ళాక నోరువిప్పడే! వాటీజ్ యువర్ నేమ్ అంటే మాట్లాడడు. పిల్లి బొమ్మను చూపించి వాటీజ్ దిస్ అంటే నవ్వుతాడుగానీ నోరు మెదపడు. ఏబిసిడీలు చెప్పమ్మా అంటే అడ్డంగా తలూపుతాడు."

నా గుండెల్లో రాయిపడింది. బహుశా అదేరాయి అందరి గుండెల్లో పడినట్లుంది. ఎవరిపిల్లల్ని వాళ్ళు బుజ్జగించివాళ్ళకు నేర్పిందంతా మళ్ళీ వెళ్ళగక్కించటం ప్రారంభించారు.

నా పేరు రానే వచ్చింది.

కిరణ్గాడిని తీసుకుని లోపల కెళ్ళాను. ఒక కళ్ళజోడు అతను, ఓ బట్టతలతను, ఓ ఆంగ్లో ఇండియన్ ముసలామెకూర్చుని ఉన్నారు.

"హల్లో-కిరణ్- కమియర్బాయ్" అంటూ కిరణ్ని తన దగ్గరున్న స్టూల్ మీద కూర్చోబెట్టిందామె.

నేను వేరే కుర్చీలో కూర్చున్నాను.

"వాటీజ్‌యువక్వాలిషికేషన్?" అందా ఆంగ్లో ఇండియన్ నా వేపు చూసి. నాకేమి అర్థంకాలేదు ఆమె మాటలు. ఎందుకయినా మంచిదని ఓ చిరునవ్వు నవ్వాను మాట్లాడకుండా!

"వయాయు లాఫీన్?" అందామె మళ్ళీ.

నాకు భయం మొదలయింది! ఆమె మాట్లాడేభాష ఇంగ్లీష్‌లాగానే వుంది కాని ఇంగ్లీషు మాత్రంకాదు.

మళ్ళీ ఓసారి నవ్విబట్టతలాయనవు చూశాను.

"వయ్ డోంటుయు ఆన్సర్?" అన్నాడతను చిరాకుగా.

నాకు చెమటలు పట్టినయ్...

"మీరేమంటున్నారు?" అనడిగాను ఆయనను దీనంగా. కళ్ళజోడతను నా పరిస్థితిని చూసి జాలిపడ్డాడు.

"అతనికి ఇంగ్లీషు రాదు కాబోలు-" అన్నాడు వాళ్ళందరితోనూ జాలిగా.

"అవునండీ! నేను తెలుగు మీడియం" అన్నాను వినయంగా.

"మైగాడ్" అన్నాడు బట్టతల వ్యక్తి బట్టతలను సవరించుకుంటూ.

"కిరణ్-టెల్‌మీ-వాటీజ్ యువర్ నేమ్?" అడిగిందామె. వాడు నావేపు చూశాడు.

"కమాన్- వాటీజ్ యువర్ నేమ్? చెప్పు-" అన్నాన్నేను వాడితో. వాడు మళ్ళీ అందరివేపు చూశాడొకసారి. నోరు మెదపలేదు- ఆమె మళ్ళీ అడిగింది. వాడు మళ్ళీ అందరి మొహాలు చూశాడు. నాకు వాడిమీద ఒళ్ళు మండిపోయింది. చెంపలు పగలకొట్టాలన్న కోరికను అతి కష్టం మీద అణచుకున్నాను.

"చెప్పు నీ పేరు చెప్పు." అన్నాను ఆత్రుతగా.

వాడు నోరు కదపలేదు.

"టెల్ ఎ బి సి డి... " అందామె.

వాడు ససేమిరా పలకలేదు.

"ఎ బి సి డి చెప్పారా?" అన్నాన్నేను కసిగా

వాడు మాట్లాడలేదు

"ఓ వెరీ పూర్-" అందామె మళ్ళీ.

నాకు అర్థమైపోయింది వాడికి సీటు దొరకడం దుర్లభమని.

"సారీ సీటు దొరకదు" అన్నాడు కళ్ళజోడు.

"వీడు కొంచెం కొత్తగా ఫీలవుతున్నాడండీ! అందుకని చెప్పడానికి జంకుతున్నాడు.

అంతే! నిజానికి వాడికి అన్నీవచ్చు. కొన్ని పదాలు కూడా చెప్పగలడు." బ్రతిమాలుతూ అన్నాను.

"సారీ– మిస్టర్– పోనీ మీకయినా మంచి మార్కులొస్తే తీసుకునే వాళ్ళం" అన్నాడతను.

"నాకా? నాకు మార్కులేమిటి?"

"ఈ ఇంటర్వ్యూలో మేము పేరంట్‌నీ, పిల్లలకూ కూడా వాళ్ళకెపాసిటీ చూసి మార్కులేస్తాము..."

"అదేమిటి? చదివేది వాళ్ళయితే మమ్మల్నెందుకు పరీక్షించడం?"

"ఇంటి దగ్గర కూడా పిల్లల విషయంలో జాగ్రత్త తీసుకునే తెలివిగల తల్లిదండ్రులుంటేనే సీటు ఇవ్వాలని మా మేనేజ్‌మెంట్ నిర్ణయం యూకెన్ గో! ఓ! మీరు తెలుగు మీడియం కదూ– మీరిక వెళ్ళవచ్చు."

నేను కిరణ్‌గాడిని బయటికి ఈడ్చుకొచ్చాను.

"ఏమయింది?" అడిగారు జనం చుట్టూ మూగి.

"నేనూ, మా కుర్రాడు ఇద్దరం ఫెయిలయ్యాం" అన్నానేను.

పిల్లలను తీసుకుని నేనూ, గోపాల్రావ్ బయటికొస్తుంటే ఓ కారు ఎదురొచ్చి ఆగింది. వెనుక సీట్లో కూర్చున్న వ్యక్తి కారు దిగుతూనే నన్ను చూసి–

"అరె! నువ్వీడకొచ్చినావేమి సంగతన్నా?" అన్నాడు నన్ను గుర్తుపట్టి.

"ఏం లేదు రాములూ! వీళ్ళిద్దరికీ స్కూల్లో ఎడ్మిషను ట్రైచేద్దామని...."

ఈలోగా ప్యూన్ పరుగుతో వచ్చి అతనికి సెల్యూట్ కొట్టి నిలబడ్డాడు.

"అరెయ్– ఇగో– సూడు– ఈ దొరల్ని తోలుకపోయి నా కమరాలో కూర్చుండబెట్టు– నేను ప్రిన్సిపాలుడితో జరంత మాట్లాడొస్త! పదండ్రన్నా! ఆడ కూర్చోండ్రి! ఇప్పుడే వస్తా!" అని సరాసరి ప్రిన్సిపాల్ రూమ్‌లో కెళ్ళిపోయాడు. నేనూ, గోపాల్రావ్ ప్యూన్‌తోపాటు మేడ మీద కెళ్ళి సెక్రటరీ అని బోర్డువున్న గదిలోకెళ్ళి కూర్చున్నాము. ఎయిర్‌కండిషన్ ఏర్పాటు ఉండటంచేత చాలా చల్లగా ఉందాగది. లోపల చాలా ఖరీదయిన ఫర్నీచరు.

"ఇప్పుడు నీతో మాట్లాడితను ఈ స్కూలు సెక్రటరీయా?" అడిగాడు గోపాల్రావ్ ఆశ్చర్యంతో.

"అలాగే కనబడుతోంది!" అన్నాను ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

"ఎట్లా తెలుసు నీకతను?"

"నేను ఎక్సయిజ్ డిపార్టుమెంటులో పని చేసేటప్పుడు పరిచయం. సారా దుకాణం కాంట్రాక్టర్– ఆ ఏరియాలో రౌడీ."

రాములు లోపలికొచ్చి కూర్చున్నాడు.

"ఆ! చెప్పన్నా! నువ్వు ఎడ్మిషన్ గురించి వచ్చినావ్?"

"అవును! అది సరేగానీ ఈ స్కూలు..."

"నాదే అన్నా! గుడంబదందా నడిచినంతకాలం మంచిగానే ఉండేగానీ, ధూల్‌పేటలో పోలీసుల జులుం ఎక్కువయిందన్నా! ఇక ఆళ్ళతో కిరికిరెందుకని ఆ దందా బంద్‌చేసి ఈ స్కూల్‌దందా షురూజేసిన! ఇగో– నిజం చెప్తున్న– ఇను! ఈ స్కూల్ నడిపే దందాల ఇంత లాభముందని ముంగటే ఎరికుంటే నేను ఆ ఫాల్తుగుడంబ పక్కకే పోకపోతుండె! పెద్ద పెద్దోండ్లు వచ్చి స్కూల్ల సీటు గురించి క్యూల నిలబడుతున్రు! ఇక పైసలు ఎన్ని గట్టమంటే అన్ని కట్టనికి తయారు... రెండేండ్లకిందట ఇరవైవేలతో ఈ స్కూలు షురూజేసిన! గిప్పుడు కమాయ్ ఎంతనో ఎరుకనా? పది లక్షలు. గిట్లుండాల దంద అంటే!"

నేనూ, గోపాల్రావ్ నివ్వెరపోయి వింటూండిపోయాము అతని మాటలు.

"అది సరేగాని మా పిల్లలిద్దరికి ఎడ్మిషన్‌కావాలి మీ స్కూల్లో! ఇప్పిస్తావా? అడిగాన్నేను అయిష్టంగానే. గుడంబా వ్యాపారం చేసే ఓ రౌడీ నడిపే స్కూల్లో మా పిల్లలు చదువు నేర్చుకోవడం నాకు నచ్చలేదు. రాములు ఓ నిమిషం మాట్లాడలేదు. ఏదో ఆలోచనలోపడ్డాడు.

"పోనీలే– కష్టమయితే ఇంకో స్కూల్లో ప్రయత్నిస్తాము" అన్నాను నేను అతని ధోరణిచూసి.

"కష్టం గురించికాదన్నా! నేను వేరే విషయం గురించి సోంచాయిస్తున్నా!"

"ఏమిటది?"

"నువ్వు నాకు చాలాసార్లు మదద్ చేసినావ్! గసంటప్పుడు నీకు నిజం చెప్పకుండా లోపల జేయనికి నాకిష్టంలేదు. నీ పిల్లగాడ్నిభీ నా పిల్లగాడు లెక్కచూడాలి గదా! వీళ్ళని వేరే మంచి స్కూల్ల జేర్పించు! నా స్కూలు మంచిగలేదు."

నేనూ, గోపాల్రావ్ మొఖాలు చూచుకున్నాం! ఆ స్కూలు ఎంతో గొప్పదన్న పుకార్లు వినే మేము అక్కడికొచ్చామసలు.

"నీ స్కూలు ఎందుకని మంచిదికాదు?" అడిగాన్నేను.

"ఏమి జెప్పాల? సదువు మంచిగుండదు."

"అదేమిటి? ఎక్కువ ఆంగ్లో ఇండియన్ టీచర్లున్నారు కదా!"

"ఆగో అక్కడనే లోపటయేది అందరూ! ఆ చట్‌కారోళ్ళు ఏం సదివిన్రనుకుంటున్నావు? ఎనిమిదో కలాసు. అదికూడా పాస్‌కాలే! తప్పిన్రు. ఇంక ఆళ్ళు పిల్లగాండ్లకేమ్ జెప్తరు? వాండ్లకే తెలియకపాయె! ఇంక మిగిలినోండ్లలో ఇద్దరు పోరీలు మా బంధువులే! ఇద్దరూ అయిదో క్లాస్‌తోనే బంద్‌చేసిన్రు. ఈళ్లందరికీ జరన్త ఇంగ్లీష్ మంచిగొస్తది గనుక

నడిచిపోతున్నది. లేకుంటే అప్పుడే కిరికిరి అవుతుండె. అసలు నా కొడుకులిద్దరు ఏడ జదువుతు(న్రో నీకెరుకనా?"

"ఎక్కడ?"

"గవర్నమెంట్ స్కూల్ల. ఆడ ఫీజు తక్కువ. సదువెట్లెయిన జెప్పనీ గానీ మంచి టీచరొకన్ని ట్యూషన్ పెట్టిన!"

"సరే వస్తా" అన్నాన్నేను లేచి నిలబడుతూ

"ఇగో ఒక్కమాట. ఈ మాట ఎవళ్తోను చెప్పకు మళ్ళా."

"అబ్బే-చెప్పను. నే నెందుకు చెప్తాను?"

"గదే అంటున్న- నువ్వు నా పాత దోస్తువని చెప్పిన."

నేనూ, గోపాల్రావ్ బయటికొచ్చాం!

"దిసీజ్ టూ మచ్!" అన్నాడు గోపాల్రావ్.

టూ మచ్చేనని నేనూ అంగీకరించాను.

"ఇప్పుడేం జేద్దాం?" అడిగాడు గోపాల్రావ్

"సెయింట్ అంథోని కిండర్‌గార్డెన్ స్కూల్‌కెళ్దాం పద."

"అక్కడ మాత్రం దొరుకుతుందంటావా?"

ఇద్దరం సెయింట్ ఆంథోని స్కూలుకి చేరుకున్నాం సైకిల్ మీద. అక్కడి వ్యవహారం కొంచెం ప్రోత్సాహకరంగానే కనిపించింది.

ప్రిన్సిపాల్ అప్పటికప్పుడే కిరణ్‌గాడిని, చిన్నిగాడిని ఇంటర్వ్యూచేసి, రిజల్ట్స్ కూడా పావుగంటలో చెప్పేశాడు. సీటు దొరికిందట. వెంటనే చెరో పన్నెండు వందలూ ఎడ్మిషన్ ఫీజుగా కట్టేయాలట.

"ఇప్పుడంత డబ్బు తేలేదండీ, రేపు కడతాం" అన్నాడు గోపాల్రావ్.

"ఊహు, రేపటికయితే గ్యారంటీ లేదండీ. ఈలోగా ఇంకెవరయినా వస్తే ఎడ్మిషన్స్ క్లోజయిపోతాయి తరువాత మీ ఇష్టం."

"పోనీ ఓ గంట టైమిస్తారా?"

ఆయన టైమ్ చూసుకున్నాడు.

"ఓ.కే. గంట టైమిస్తున్నాను" అన్నాడు చిరాగ్గా.

గోపాల్రావ్ సైకిల్‌మీద రివ్వున దూసుకెళ్ళి అరగంట తర్వాత నురగలుకక్కుకుంటూ వచ్చి ఇద్దరికీ ఫీజు కట్టేశాడు.

"హమ్మయ్య పెద్ద సమస్య తీరిపోయింది" అన్నాడు. సరిగ్గా అప్పుడే ఓ పెద్దమనిషి హడావిడిగా స్కూలు గేటు దగ్గర్నుంచి మావేపు వచ్చాడు.

"ఫీజు కట్టేశారా?" అన్నాడు ఆత్రుతగా.

"ఆ కట్టేశాం– ఎందుకలా అడిగారు?" అన్నాను ఆశ్చర్యంగా.

గాలిలోకి చేతులు ఎత్తి "గోవిందా–గోవిందా" అంటూ అరిచాడు దణ్ణం పెడుతూ. మా గుండెల్లో రాయి పడింది.

"ఏమిటది? ఎందుకలా అంటున్నారు? అడిగాడు గోపాల్రావ్ పాలిపోయిన మొఖంతో.

"మీ ఫీజు గోవింద!"

"ఏం ఎందుకని?"

"ఎందుకేమిటండీ మావాడిని కిందటేడు ఈ స్కూల్లో జేర్పించాను. వాడికిలెక్కల్లో ఎ+బి హోల్స్క్వేర్ అంటే ఎస్క్వేర్ ప్లస్ బిస్క్వేర్ అని చెప్పాడట ఆ ఇడియట్. వీడింక పిల్లలకేం నేర్పుతాడు?"

"అంటే లెక్కల మాష్టారుకి లెక్కలు తెలీదా?"

"గోవిందా... గోవింద." అసలు లెక్కలు మేష్టరంటూ ఒకడుంటేకదా. ప్రిన్సిపాల్ సెవెన్త్క్లాస్ వాళ్ళకి లెక్కలు, సైన్సూ చెప్తాడు. అందుకే మొన్న పరీక్షకెళ్ళిన ముప్పయి మంది కుర్రాళ్ళలో ఇరవైమంది ఫస్ట్క్లాసులోనూ, మిగతా పదిమంది సెకండ్క్లాసులోనూ తప్పారు."

"తప్పారా?"

"అవును. ఫస్టు సెకండ్క్లాసుల్లో"

"దేముడో– ఇప్పుడేమిటి చేయడం?"

"ప్రజాసేవ చేయండి. ఈ గేటుదగ్గర కాసేపురోజూ కూర్చుని– కొత్తగా బలి అయేందుకు వచ్చేవాళ్ళను రక్షించండి." అనేసి వెళ్ళిపోయాడతను.

గోపాల్రావ్, నేనూ ఒకరి మొఖాలొకరు చూచుకున్నాం.

"పద. మన ఫీజు మనకిమ్మని అడుగుదాం" కోపంగా అన్నాడు వాడు.

"వాడివ్వనంటే."

"మర్డర్చేసేద్దాం. జైల్లో గడపడానికి నేను సిద్ధంగా ఉన్నాను."

ఇద్దరం మళ్ళీ ప్రిన్సిపాల్ గదిలోకి జొరబడ్డాం.

"మా ఫీజు మాకిచ్చేయ్" అన్నాడు గోపాల్రావ్ చొక్కాచేతులు పైకిమడిచి.

"ఒక్కసారి ఫీజు కట్టాక–ఏ పరిస్థితులలోనూ తిరిగి ఇవ్వబడదని రసీదు వెనుక రాశాంకదా? అది మారూలు–"

"ఇవ్వకపోతే మొఖం పగలగొట్టాలని మాకూరూలుంది."

అతను కోపంగా కుర్చీలోంచి లేచాడు.

"అసలు ఎందుకు వాపస్ ఇవ్వాలి నేను?"

"ఎందుకంటే నీ బోడి స్కూల్లో క్వాలిఫైడ్ టీచర్లులేరు గనుక."

"ఏ స్కూల్లో ఏడిచారు గనుక– నా స్కూలులో ఉండటానికి?"

"మీ స్కూల్లో అందరూ ఫస్ట్‌క్లాసులో తప్పుతున్నారు."

"అది వాళ్ళకర్మ! నేను "పాస్ చేయటం' గారంటీ ఇవ్వటంలేదు."

"వాళ్ళ కర్మకాదు. నీకు చదువుచెప్పటం రాకపోవటం మూలాన తప్పుతున్నారు."

"ఎవడాడు రాదంది?"

"అయితే ఎ+బి హోల్ స్క్వేర్ ఎంతోచెప్పు."

"సడన్‌గా చెప్పమంటే ఎలా? ప్రిపేరవ్వాలి. ఎల్లుండి మార్నింగ్ ఒకసారి కనబడండి! చెప్తాను!"

"పోనీ న్యూటన్స్ సెకండ్ లా ఆఫ్‌మోషన్ ఏమిటో చెప్పు."

"ఫస్ట్‌లా ఆఫ్‌మోషన్ మొదటి లైనుకొంచెం చెప్పండి మిగతాది చెప్పేస్తాను."

"ఛస్తే చెప్పను–"

"అయితే నేనూ సమాధానం చెప్పను–"

"చెప్పలేకపోతే నాఫీజు నాకిచ్చేయి. రెండిట్లో ఏదోకటి చెయ్యి."

అతను చాలాసేపు ఆలోచించి ఏవేవో తప్పులు చెప్పటం మొదలు పెట్టాడు.

"నీకు రాదులేగానీ డబ్బిచ్చేయ్" అన్నాడు గోపాల్రావ్.

"నేనివ్వను."

గోపాల్రావ్ ఠక్కునవాడి చొక్కా పట్టుకున్నాడు. అంతే! ఐదునిమిషాల పాటు అక్కడేం జరుగుతుందో నాకు తెలీదు. బల్లమీద– వస్తువులూ, గోడలకున్న కాలెండర్లూ, కుర్చీలూ, చెత్తబుట్టా, ఫోనూ, అన్నీ ముక్కలు ముక్కలయిపోయినాయి. వాళ్ళ యుద్ధంలో! ఈలోగా ఆ స్కూలు సెక్రటరీ కాబోలు వచ్చి గోపాల్రావ్‌ని పట్టుకోబోయాడు. మరో పక్కనుండి ఆ స్కూలు ప్యూన్ అతనికి సహాయంగా వచ్చాడు. ఇంక నేను చూస్తూ ఊరుకోలేకపోయాను. వాళ్ళిద్దర్నీ చెరోతన్నూ తన్ని కిందపడగానే కుర్చీలు మీదవేసి నొక్కిపట్టాను. మరో ఐదు నిమిషాలు భీకర సంగ్రామం జరిగింది. బయట నిలబడ్డ కిరణ్‌గాడు, చిన్నిగాడు లోపలికొచ్చి ఆ దృశ్యం చూసి ఎంతో ఆనందించారు. సినిమాసీనుల్లో ఫైటింగ్ చూడడం వారికెంతో ఇష్టం. అదే ఎదురుగ్గా జరుగుతోంది మరి.

"డాడీ– వాడిని పిస్టల్‌తో కాల్చేయ్" అని సజెషన్ ఇచ్చాడు చిన్నిగాడు.

హఠాత్తుగా ప్రిన్సిపాల్ మెడ గోపాల్రావ్ చేతుల్లో ఇరుక్కోవడంతో ఊపిరాడక "బాబోయ్ మీ డబ్బిచ్చేస్తాను వదలండి" అనరిచాడు ప్రిన్సిపాల్.

ఇద్దరం బట్టలుదులుపుకుంటూ లేచి నిలబడ్డాం. ప్రిన్సిపాల్ చేతిమీద నుంచి రక్తం కారుతోంది. గోపాల్రావ్‌గాడి కన్నువాచిపోయింది. నాకాలు ఫ్రాక్చరయిందేమో అనుమానం. చివరకు ఇద్దరికీ చెరో వందరూపాయలూ కాన్సిలేషన్ ఫీజుకింద తీసుకుని మిగతా డబ్బిచ్చేశాడు ప్రిన్సిపాల్.

ఇద్దరం చిరిగిన బట్టలతోనూ, చెరిగిపోయిన జుట్టుతోనూ, ఒగరుస్తూ బయటికొచ్చి పిల్లలను+సైకిళ్ళనూ నెమ్మదిగా తీసుకుని నడవసాగాము. నాలుగడుగులు వేశామోలేదో శంకర్రావ్ ఎదురయ్యాడు. మా అవతారాలు చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి అవతారాలు? స్కూలు ఫీజు వాపస్ గొడవేనా?" అడిగాడు నవ్వుతూ.

"అరె! నీకెలా తెలుసు?" ఇద్దరం ఉలిక్కిపడి అడిగాము.

"స్కూల్స్ తెరిచే రోజుల్లో అందరం నాలుగుచోట్ల యుద్ధ చేస్తేనే గదా ఈ చెత్త స్కూల్స్ తప్పించుకునేది."

"నేను అరుగురు శెక్రటరీలను, పధ్నాలుగుమంది ప్రిన్సిపాల్‌నీ కత్తితో పొడిచాను– ఫీజు వాపసుకోసం."

"అంతమందినా?"

"అవును మరి. చాలా చోట్ల నేనూ కత్తిపోట్లు తిన్నాననుకో– తప్పదు మరి. మన పిల్లల్ని ఆంధ్రప్రదేశ్‌లో చదివించాలంటే తల్లిదండ్రులు ఈ మాత్రం రిస్క్ తీసుకోవాల్సిందే."

"ఒకవేళ ప్రిన్సిపాల్ స్త్రీ ఉంటే ఎలా?" అడిగాడు గోపాల్రావ్.

"అప్పుడు మా ఆవిడను పంపిస్తాను. దానికి ఈ మధ్యే కరాటే నేర్పించాను. దీనికోసమని. ముగ్గురు లేడీ ప్రిన్సిపాల్స్‌ను చావగొట్టి ఫీజు వాపస్ తీసుకొచ్చింది. ఇప్పటికి– కనుక ముందు మీ భార్యలను కరాటే స్కూలుకి పంపించండి. వీలయితే మీరూ నేర్చుకోండి వస్తా– ఇంకో శెక్రటరీ ఈ పక్క కల్లు కాంపౌండ్‌లో కల్లుతాగుతున్నాడట. వాడి అంతు తేల్చుకోవాలి." అంటూ కత్తి బయటకు తీసి పక్కనే ఉన్న కల్లు కంపౌండ్‌లోకి పరుగెత్తాడు.

"పద" అన్నాడు గోపాల్రావ్.

"ఎక్కడికి?" అడిగాను.

"కరాటే స్కూలుకి"

"మరి పిల్లలో..."

"వాళ్ళను కూడా తీసుకెళదాం... మనకి సహాయంగా ఉంటారు పోనీ ఇంకో పని చేద్దాం. నువ్వు కరాటే స్కూలు కెళ్ళు. నేను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ ఆఫీసుకెళతాను. ఇలాంటి చెత్త స్కూల్సు అన్నిటికీ గవర్నమెంటు రికగ్నిషన్‌యిస్తున్న ఆ ఆఫీసరు అంతు తేల్చుకొస్తాను..." వాడు పిల్లల్ని తీసుకుని కరాటే స్కూలు వేపు బయల్దేరాడు.

నేను డి.పి.ఐ. ఆఫీసు చేరుకున్నాను.

రిసెప్షనిస్టు చుట్టూ జనం గుమిగూడి ఉన్నారు.

అందరికీ సమాధానాలు చిరాకుగా చెప్తొందామె.

చివరకు నావంతువచ్చింది.

"ఏం కావాలి?"

"అడ్డమైన స్కూల్సుకీ రికగ్నిషన్ యిస్తున్న మీ డైరెక్టర్ని కత్తితో పొడవాలి! ఎక్కడాయన?"

"ఆయనని కత్తితో పొడవాలనుకుంటున్న పేరెంట్సు క్యూ ఆఫీస్ వెనుకవేపు వుంది. అటు వేపు వెళ్ళి 'క్యూ'లో నిలబడండి" అందామె చిరాకుగా.

